# విద్యారంగ సమస్యలు - పరిష్కారము

srisathyasaivachanamrutam

దివ్యాత్మ స్వరూపులైన అధ్యాపకులారా!

ఆలోచించగల ప్రతి మానవుని అయోమయ స్థితిలో ముంచెత్తే సమస్యలు యీనాడు విద్యారంగములో విరివిగా కనుపించుచున్నవన్న విషయము విజ్ఞులకు విదితమే. నిత్య జీవితమునకు సంబంధించిన ప్రతిరంగమును పుష్టివంతముగను, అనుకూలవంతముగను తీర్చి దిద్దవలసిన బాధ్యత విద్యాసంస్థలపైన వున్నది. విద్యకు ప్రధానమైన వినయవిధేయతలు, సేవా భావము, విశాలహృదయము యీనాడు కొంతవరకు కుంటువడినవి. మానవతాగుణములైన సత్య, ప్రేమ, సహనాదులు మచ్చునకుకూడా కనుపించుట లేదు. కనుకనే నేడు విద్యాలయములు అశాంతి మందిరములుగా తయారగుచున్నవి. దీనికి కారణమేమని విచారించగా అనేకమంది విద్యార్థులే దీనికి కారణమని చెబుతున్నారు. ఇది సరైన జవాబు కాదు. దీని విషయమై గుర్తించే వ్యక్తులుకూడను కన్పించుట లేదు. ప్రత్యక్షముగా, పరోక్షముగా యింకా అనేక విధములుగా కూడను అనేక కారణములుంటున్నవి.

**విద్యారంగములో సమస్యలకు మూలకారణము తల్లిదండ్రులు, అధ్యాపకులు, పాలకవర్గము, ప్రభుత్వము మరియు రచయితలు**

విద్యార్థులయొక్క భావములను అధ్యాపకులు గుర్తించటము లేదు, అధ్యాపకులయొక్క వాక్యములు విద్యార్థులు శిరసావహించటము లేదు. ఈ కారణములచేత పాలకవర్గమైనవారుకూడను తమ బాధ్యతను గుర్తించుట లేదు. వీరి సాధక బాధకములను గుర్తించే ప్రభుత్వముకూడ సకాలములో సరైన చర్యలు తీసుకోవడం లేదు. ఈ కారణంచేత విద్యార్థులు ఓర్పును కోల్పోయి కొన్ని విధములైన అలజడులను ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సమయాన్ని పురస్కరించుకొని కొంతమంది రాజకీయవేత్తలు

యిందులో ప్రవేశించి, యింకా అనేకదుష్టశక్తులు యిందులో ప్రవేశించి విద్యాసంస్థలను రణరంగములుగా మార్చుచున్నవి. ఈ పరిస్థితులను గమనించి పోలీసులు ప్రవేశించి విద్యాసంస్థలను మూసివేయుచున్నారు. సరస్వతీనిలయములైన విద్యాసంస్థలయందు యీ విధమైన హింసాకాండలు జరుగుట విరుద్ధమైన చర్యలు. దీని కారణము గుర్తించే వ్యక్తులు అయోమయ స్థితిలో వుంటున్నారు. దీనికి సరైన విమోచన యేమిటనేది చాలా జటిలమైన పరిస్థితిలో వుంటున్నాది. సరైన కారణము గుర్తించలేక దీనికి అనేక విధములైన వ్యూహములు పన్నుతున్నారు, అధికారులు. కనిపెంచిన తల్లితండ్రులు దీనికి బాధ్యులు. బుద్ధి వికాసమునకు తోడ్పడే అధ్యాపకులు దీనికి కారణము. పాలక వర్గముకూడా సరైన విషయములను గుర్తించి వర్తించకపోవటము యీ పాలక వర్గముయొక్క దోషము. పరిపాలకులు, యీ సంస్థ పాలక వర్గమువారియొక్క పరిస్థితిని చక్కగా గుర్తించక తామసము చేయుటము, సకాలములో దీనిని పరిష్కరించక పోవటము, ప్రభుత్వము యొక్క దోషము. నైతిక, ఆధ్యాత్మిక శీలతత్త్వమును యినుమడింపజేయగల రచయితల యొక్క తప్పుకూడను యిందు వుంటున్నది. ముఖ్యముగా యిందులో ఎవరెవరి బాధ్యత వారు సక్రమముగా గుర్తించకపోవటమే దీనికి మూలకారణము. ఈ విద్యాసంస్థలలో యేర్పడిన యీ సమస్యలకంతా మూల కారణము తల్లితండ్రులు, అధ్యాపకులు, పాలక వర్గమువారు, ప్రభుత్వము, రచయితలు.

### తెలివితేటలను పెంచటమే విద్యయొక్క లక్ష్యము కారాదు

ఈనాడు స్వాతంత్ర్యము వచ్చి ముప్పది తొమ్మిది సంవత్సరములైనప్పటికిని బ్రిటీషువారు ప్రారంభించిన పద్ధతినే అవలంబిస్తూ దానిని సక్రమమైన మార్గములో మార్చుకొనలేకపోతున్నారు భారతీయులు. 'బ్రిటీషువారు ఏ ఉద్దేశ్యముతో యీ పద్ధతిని స్థాపించిరి' అనే సత్యాన్నికూడ నేటివరకు గుర్తించలేకపోతున్నారు, భారతీయులు. ఈ విద్యావిధానమును ప్రారంభించుటకు పూర్వమే మెకాలే ఒక దీక్షను పూనాడు. బ్రిటీష్‌వారు స్థాపించిన విద్యావిధానము భారతీయులయొక్క రక్తమాంసములందును, భావములందును

చొచ్చుకునిపోయి, వారిని బ్రిటీషువారిగా తయారుచేయవచ్చుననే విశ్వాసమును అతను పెంచుకున్నాడు. బ్రిటీషువారి సానుకూల నిమిత్తమై యీ పద్ధతులంతా ప్రారంభించాడు. విద్య కేవలము ఉద్యోగనిమిత్తమనే విశ్వాసమును భారతీయుల హృదయములో ఘాటుగా నాటుకొని పోయేటట్లుగా బోధించుతూ వచ్చాడు. దురదృష్టవశాత్తు విద్య ఉద్యోగనిమిత్తమే కాకుండా విజ్ఞాన సముపార్జన నిమిత్తమై యేర్పడినదనే సత్యాన్ని యీనాటికికూడ భారతీయులు గుర్తించలేకపోతున్నారు. కనుక, విద్యార్థులయొక్క భావములందు యీ మార్పును ప్రప్రథమములో మనము కల్గించాలి. తమ కాళ్ళపైన తాము నిలుచునే శక్తిని తాను సంపాదించుకొనే మార్గాన్ని వాళ్ళకి బోధించాలి. కర్మవీరులుగా మనం తయారుచేయాలి. కేవలం మాటలను కట్టిపెట్టి పనియందు ప్రావీణ్యులయ్యేటట్లుగా మార్గమును మనము అవలంబించాలి. తెలివితేటలను పెంచుకొనుటయే విద్యయొక్క ప్రధానమైన లక్ష్యము కాదనియు, ఆ పెంచుకున్న తెలివితేటలను ఆచరణయందుంచి సమాజములో వున్న సర్వప్రజలనుకూడను అనుకూలవంతమైన రీతిగా తీర్చి దిద్దాలని వాళ్ళు గుర్తించాలి. కేవలం తలలయందు మాత్రము Ideals అభివృద్ధి చేసుకుంటూ పోవటంచేత యిది కేవలం నిరుపయోగమైన జీవితముగా రూపొందుతూ వస్తుంది.

An idle man's mind is devil's workshop అన్నారు. విద్యార్థులకు చేతినిండుగా పని అందించాలి. వారికి తగినంత పని లేకపోవటంవల్లనే తమయొక్క తెలివితేటలను పెడమార్గములో పట్టిస్తూ వస్తున్నారు. ఈనాడు ఎక్కడ చూచినప్పటికిని సెక్సు, డిటెక్టివ్స్, యీ బుక్స్ విరివిగా వుపయోగపెడుతున్నారు. ఈ విధమైన నిరుపయోగమైన గ్రంథములు అభివృద్ధి అయిపోయి ఉపయోగకరమైన గ్రంథములు వుద్భవించలేకపోవటముచేతనే యీ విద్యార్థులయొక్క పరిస్థితులు చాలా తారుమారుగా వున్నవి.

**అధ్యాపకులు నిరంతరము ప్రకాశించే జ్యోతులవంటివారు**

విద్యార్థులకు ప్రధానమైనది నైతిక, ఆధ్యాత్మిక శీలము. ఈ విధమైన నైతిక, ఆధ్మాత్మిక తత్త్వాలను వారు హృదయమునందు నింపుకున్నప్పుడే యీనాటి విద్యావిధానము సార్థకమవుతుంది. నైతిక, ఆధ్యాత్మికములు వస్త్రమునకు పడుగు పేక వంటివి. దీనిని



sri sathyasaivachanamrutam

విడదీయటానికి వీలుకానిది. ఈ రెండును చేరినప్పుడే మానవునియొక్క శీలతత్త్వము అత్యున్నత స్థితికి పోతుంది. ఈనాడు విద్యావిధానములో యిలాంటి ప్రబోధలు అత్యవసరముగా జరపాలి. నిజముగా విద్యార్థులెవరని విచారిస్తే అధ్యాపకులే నిజమైన విద్యార్థులు. విద్యార్థులు ఏదో ఒక subject, ఒక course, ఒక degree వరకే గ్రంథాలు పఠిస్తూ వుంటారు. కానీ అధ్యాపకులు జీవితమంతా గ్రంథములు పఠిస్తూవుండాలి. జీవితమంతా చదవగల్గినవారు అధ్యాపకులే! వారు చదివినప్పుడే విద్యార్థులకు ఆ విద్య అందించడానికి అవకాశముంటుంది. నిరంతరము మండుతున్న జ్యోతినందే మిగిలిన జ్యోతులు అంటించుకొనుటకు సాధ్యమవుతుంది. కనుక, అధ్యాపకులు నిరంతరము ప్రకాశించే జ్యోతులవంటివారు. అధ్యాపకులయొక్క తత్త్వము, అధ్యాపకులయొక్క ఉద్యోగము చాలా తక్కువ స్థాయిలో వున్నదిగా భావిస్తూ వుంటారు. ఇది సరైనది కాదు. అధ్యాపకులు సరైన రీతిగా వుండినప్పుడే విద్యార్థులను భావిభారతోద్ధారకులుగా తీర్చిదిద్దడానికి సాధ్యమవుతుంది. అనేకమందిని భారతదేశముయొక్క పరిపాలకులుగా తయారు చేసేవారు అధ్యాపకులే. రాజకీయనాయకులుగాను, దేశోద్ధారకులుగాను తయారు చేసేది అధ్యాపకులే. ఆ సత్యాన్ని యీనాడు అధ్యాపకులు గుర్తించుకొనలేక కేవలము కింగ్స్‌ని మాత్రం చూసి ఆనందిస్తున్నారు. కాని మేము Kingmakers అనే సత్యాన్ని గుర్తించుకోలేక పోతున్నారు. కనుక, అధ్యాపకులు Kingmakers గా వుండాలి. ఆ King makers యే విధముగా వుండాలంటే ఆదర్శవంతమైన makers గా వుండాలి.

**విద్యార్థులు ఎలక్షన్లలో ఏ మాత్రము ప్రవేశించకూడదు**

విద్యార్థులు భవిష్యత్తులో యే విధమైన యిక్కట్లకు గురౌతారో అనే సత్యాన్ని ముందుగనే విచారించి మాస్టరుప్లాను వేసుకొని దానిని బోధించటానికి ప్రయత్నించాలి. విద్యార్థులకు ఎల్లప్పుడు చదివేపని లేక లేబరేటరీలో చేసేపని నియమించటము అంత సరియైనది కాదు. జీవితములో విద్య ఒక్కటి మాత్రమే అంగముకాదు. జీవితము అనేక శాఖలతో కూడినది. వారి మనసుకు, మనిషికి కొంత విశ్రాంతి నందించాలి. తెల్లవారినది మొదలు రాత్రివరకు వారికి గ్రంథపఠనమందే, పరిశోధనలయందే కాలము గడిపిన యీయొక్క మానసిక

sri sathyasai vachanamrutam

తత్త్వము కొంతవరకు బలహీనపడవచ్చును. ఈ విశ్రాంతి అంటే ఏమిటి? పరుపువేసుకొని పండుకొనటమా లేక గదిలో కూర్చొని హాయిగా తన భావాలను తాను వూహించుకొనటమా, యిదికాదు విశ్రాంతి. change of work is rest. కొంతసేపు చదవటము, కొంతసేపు ఆడటము, కొంతసేపు పాడటము అనేక యితర పవిత్ర కార్యములలో ప్రవేశించటము. ఈ విధమైన వృత్తులలో వాళ్ళు ప్రవేశించటానికి కావలిసిన ఉత్సాహప్రోత్సాహములను అధ్యాపకులు వారికి అందించాలి. ఈ విద్యారంగములయందు కొన్ని విపరీతమైన వృత్తులుకూడను అభివృద్ధి అవుతున్నాయి. కొన్ని విద్యాసంస్థలలోపల ప్రభుత్వముయొక్క బలహీనతే ప్రధాన అంశము అని చెప్పవచ్చును. ఇక్కడ ఎలక్షన్లు అభివృద్ధి అవుతున్నాయి. ఇవి విద్యార్థులయొక్క జీవితాన్ని మరింత అస్తవ్యస్తము చేస్తున్నాయి. విద్యార్థులు ఎలక్షన్లలో ఏ మాత్రం ప్రవేశించకూడదు. ఎవరు అన్ని రంగములయందుకూడను, వుత్తమ స్థాయిలో పవిత్రమైన భావములతో, సరైన నడవడికతో, మార్కులు సరైన రీతిలో తెచ్చుకుంటాడో వారిని దీనికి అధికారిగా మనం నియమించుకోవాలి. ఇవి సాధారణముగా సర్వవిద్యాసంస్థలయందు వుండవలసిన ప్రధాన లక్షణాలు. కాని మన Institute లోపల దీనికే మాత్రం సంబంధము లేదు. చిత్తశుద్ధి కల్గిన అధ్యాపకులు, పవిత్రప్రేమ కల్గిన విద్యార్థులు యీ సంస్థలో అధికముగా వుంటున్నారు. మార్గదర్శకులైన అధ్యాపకులు, భవిష్యత్తుకు రాజమార్గము నిర్మించే విద్యార్థులు మన Instituteలో లేకపోలేదు. ఇలాంటి సదవకాశము మనకి లభించినప్పుడు సద్వినియోగ పరచుకోవటం చాలా అవసరము. మన కాలమును, మన కర్మమును, అధికంగా వుపయోగ పెడుతున్నామని అధ్యాపకులు యేమాత్రం విచారించరాదు. వర్క్‌లోడ్‌ని మనం యేమాత్రం చింతించకూడదు. మంచి విద్యార్థులు లభించినప్పుడు మన కాలాన్ని సద్వినియోగము చేసుకొనటమే ఒక పెద్ద అదృష్టముగా మనము భావించాలి. అలాంటి విశాల భావము అధ్యాపకులలో వున్నప్పుడే విద్యార్థులయొక్క భవిష్యత్తు ఎంతైనా వున్నతస్థాయికి పోతుంది. ఏ సమయమైనా సరే విద్యార్థులయొక్క సమస్యలు, బాధలు వచ్చినప్పుడు మనము పరిహారము చేయడానికి సిద్ధంగా వుండాలి. ఈ విషయంలో కాలాన్ని మనము వ్యర్థము చేయరాదు. విద్యార్థులకు సమస్యలేర్పడిన తక్షణమే వాటిని పరిహారం

sri sathyasai vahini vacharamrutam

చేసేందుకు మనము సిద్ధముగా వుండాలి. మనము యీ విధముగా ఆదర్శముగా వుండినప్పుడే సహజంగా విద్యార్థులుకూడను మనలను అనుసరించటానికి యేమాత్రం వెనుకంజ వేయరు. అధ్యాపకులు water tank వంటివారు. విద్యార్థులు taps వంటివారు. ఈ అధ్యాపకులలోపల ఎలాంటి భావాలు మనము fill up చేసుకుంటామో యీ taps అనే విద్యార్థులలోపల అలాంటి భావములే వస్తూ వుంటాయి. కనుక విద్యార్థులలో యేవైనా దోషములుండినాయంటే అవి అధ్యాపకులయొక్క దోషములనే చెప్పవచ్చును. సకాలములోపల ఆ సమస్యలు పరిహారము చేసినప్పుడు తనకు, విద్యార్థులకు కూడను ఎంతైనా ఉత్సాహప్రోత్సాహములు అభివృద్ధి అవుతుంటాయి.

**అద్యాపకులు శాంతము, సహనములతో విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవాలి**

నిజముగా మన Instituteలో చేరిన విద్యార్థులు చాలా పవిత్ర హృదయులు, నిర్మల చిత్తులు, నిస్వార్థ హృదయులు. ఇలాంటి విద్యార్థులు మరొక సంస్థలో మనకు చిక్కరు. వేరువేరు విద్యాసంస్థలందు విద్యార్థులను చూస్తే అధ్యాపకులు, అధ్యాపకులను చూస్తే విద్యార్థులు ఉద్రేకపూరితులైపోతున్నారు. బయటి విద్యార్థులెవరిని చూసినప్పటికిని కేవలం ఆవేశ ఉద్రేకాలతో వుండే ముఖములే కన్పిస్తుంటాయి. ప్రశాంతమైన ముఖములు యెక్కడా కనుపించటములేదు. కారణమేమిటి? తమయొక్క హృదయాలలో వుండేవి ముఖములో ప్రతిబింబిస్తూ వుంటాయి. మంచికాని చెడుకాని మన ముఖములలోనే కన్పిస్తూంటాయి. హృదయములో వుండేవి ముఖములో అద్దమువలే ప్రతిబింబిస్తూ వుంటాయి. మన విద్యాసంస్థలలో వుండే విద్యార్థుల ముఖములు నిరంతరము చిరునవ్వుతో చిందులు తొక్కుతూ వుంటాయి. ఆ సమయాన్ని సమంగా మనం గుర్తించి వారిముందు మనము సరైనరీతిలో వర్తించాలి. వారి ఆనందమునకు గాని, వారి ఆశయములకు గాని, వారి ఉత్సాహమునకు గాని యే మాత్రము మనము అడ్డు తగలకుండా చూచుకోవాలి. విద్యార్థులలో కొన్ని బలహీనతలు వుండవచ్చు. వారు చిన్నవారు. అనుభవము లేనివారు. విషయము తెలియక వివేకమును అభివృద్ధి పరచుకోలేనివారు. వినయ విధేయతలతో వారికేమాత్రం కూడను పరిచయం లేనివారు. కనుక అట్టి పిల్లల్లో కొన్ని దోషములు

srisathyasaivahanamrutam

వుండటంలో యే మాత్రం ఆశ్చర్యం లేదు. కాని మనము అన్ని రంగములయందు, అన్ని విధములైన మార్గములందు అనుభవజ్ఞులమై యీ విధమైన మార్గమును వారు అర్థము చేసుకోటానికి తగిన పరిస్థితిలో మనము సిద్ధముగా వుంటుండాలి. మనము శాంతముతో, సహనముతో వారితో సరైన సంబంధమును కల్పించుకొని సమాధానమిచ్చే వ్యక్తులుగా తయారుకావాలి. విద్యార్థులు, యువకుల వయస్సు చాలా అలలతో కూడిన సముద్రమువంటిది. దానికేవిధమైన ఆటంకములు కల్గినా వుద్రేకములధికమవుతుంటాయి. తక్షణమే వారు అధ్యాపకులపైన కొంతవరకును అసంతృప్తిని వెలిబుచ్చుతారు. శతృత్వమే లేకుండాపోతే సహనానికి అవకాశమే లేదు. కనుక, ఆ విధమైన అలజడి మన సహనానికి తోడ్పాటు చేస్తున్నాదని భావించాలి. కనుక, ప్రతి ఒక్కటి మన మంచికోసమనే సత్యాన్ని గుర్తించాలి.

**విద్యావిధానములో నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక అంశములు లేకపోవడమే అన్ని అనర్థములకు మూలకారణము**

విద్యార్థులకు కొన్ని ఆధ్యాత్మిక, నైతిక విషయాలను కూడను బోధించాలి. ప్రతి బేస్తవారం moral classes అని పెట్టుకున్నాం. కానీ యీ moral classes లో జరిగే ఉపన్యాసాలతో మాత్రమే యిది మార్పు చెందేది కాదు. కొంతమంది అధ్యాపకులలో కొన్ని సందేహములు రావచ్చును. ఏమిటి? ఎప్పుడు చూచినా భజనలు, సాధనలు పవిత్రమైన భావములే తెల్పుతూ వుంటే వీరికి పాఠ్యాంశముల బోధన ఎప్పుడు జరుగుతుంది, అని. వీరు విద్యావంతులు కాకుండా ఏ సన్యాసులౌతారో, ఏ యోగులౌతారో అనే సందేహముకూడా కలుగవచ్చు. సాధువులు, సన్యాసులు, యోగులుగా తయారవడము అంత సులభము కాదు. విన్నంత మాత్రమున మార్పు చెందేది కాదు, మానవుని స్వభావము. ఇన్ని సంవత్సరములనుండి మీరంతా వింటున్నారు. ఎంతమంది సన్యాసులయ్యారు? ఎంతమంది యోగులయ్యారు? ఇది సరైన భావము కాదు. నిజముగా సన్యాసులైనా మంచిదే. యీ అర్థములేని జీవితము, యీ విధమైన పవిత్ర భావములు లేని చదువుకంటే సన్యాసమే మేలని చెప్పవచ్చును. ఒకానొక సమయము లోపల



srisathyasaivachanamrutam

రాజగోపాలాచారి "వినయవిధేయతలు, ఆధ్యాత్మిక భావములు అభివృద్ధిపరచి బోధించని చదువులకంటే చదువు లేనివాడే చాలా ఉత్తముడని" చెప్పాడు. ఈనాడు విద్యావిహీనులైన మూర్ఖులకంటే విద్యావంతులైన దుష్టులే అధికముగా కనిపిస్తున్నారు. మీకందరికి కూడను తెలుసు. హైజాకర్సుగా వుంటున్నారు, కిడ్నాపర్సుగా వుంటున్నారు, డెకాయిట్సుగా బయలుదేరుతున్నారు. వీరందరు చదువులేనివారా? కాదే! బాగా చదువుకున్నవారే! కనుక అందరు విద్యావంతులు యిలా చేయటంలేదు. అందరు విద్యావిహీనులు అలా వుండటంలేదు. విద్యావిధానము లోపల నైతిక, ఆధ్యాత్మిక, ధార్మికములు లేకపోవటమే యీ విధమైన అనర్థములకు మూల కారణము. ఈనాడు యాంత్రికముగా education జరిగిపోతున్నదిగానీ దీనిలో చైతన్యముగాని, నైపుణ్యముగాని యే మాత్రం కన్పించటంలేదు. ఆ విధముగా వుంటూవుండకూడదు విద్యావిధానము. మన భావములో, మన హృదయములో, మన రక్తములోకూడ యిది పవిత్ర భావముతో ప్రవేశించాలి.

**క్వాంటిటీ పెరగడంవల్ల క్వాలిటీ తగ్గిపోతుంది**

ఈనాడు విద్యావిధానము ఒక పవిత్రమైన బాధ్యతగా తీసుకోటంలేదు. "నేను లెక్చరర్‌గా వుండినంతవరకు యిది నా బాధ్యత, తరువాత వాళ్ళ వాళ్ళ యిష్టం దీనితో నాకేమి సంబంధము లేదు", అని యే మాత్రం అలక్ష్యము చేయరాదు. జీతంకోసం నేను పనిచేస్తున్నాను అనే భావము అధ్యాపకులకు హృదయములో పోయి, జీవితంకోసం నేను దీనిలో ప్రవేశించానని భావించాలి. అధ్యాపకులలో యీ పవిత్ర భావములు అభివృద్ధి అయినప్పుడే, విశాలహృదయములు అభివృద్ధి అయినప్పుడే దేశమునకు వుపకారం చేయవచ్చు. ఇంతేకాక, విద్యార్థులయొక్క భవిష్యత్తును కూడ కొంత అర్థము చేసుకోవాలి. ఈనాడు ప్రభుత్వముయొక్క వత్తిడిచేతను, సమాజముయొక్క వత్తిడిచేతను విద్యాసంస్థలలోపల వందలకు వందలు విద్యార్థులను చేర్చుకుంటూ వస్తున్నారు. తద్వారా సరైన standard వారికి ఉండటము లేదు. మనయొక్క విద్యాసంస్థలలో మాత్రము అవసరమైతే రెండు సెక్షనులు పెట్టుకోవాలిగాని అధికముగా విద్యార్థులు వుండరాదు. ఒక్కొక్క సెక్షనులో 30-40 మందే పిల్లలుండాలి. కానీ 60 లేక 80 మందిని గొడ్లను

srisathyasai vahini / vachanamrutam

తోలినట్లు తోలకూడదు. తక్కువమంది వుంటే క్వాలిటి ఎక్కువగా అభివృద్ధి చేయవచ్చు. క్వాంటిటీ పెరగటం వల్ల క్వాలీటి తగ్గిపోతుంది. తెలుగులో చెప్తువుంటారు. మంది పెరిగే కొద్ది మజ్జిగ పల్చన అయిపోతుంది. అదేవిధముగా మనము విద్యార్థులు అధికముగా వుండాలని ఆశించనక్కరలేదు. తక్కువమందిని పెట్టుకొని ఎక్కువగా వారితో పని చేయించాలి. ముఖ్యముగా మనము విద్యార్థులకు మనపై పవిత్రమైన భావము, విశ్వాసము వచ్చేటట్లుగా చేసుకోవాలి. ఆ విధమైన విశ్వాసము, ప్రేమ మనపైన లేకుండా పోయినట్లైతే మనము ఎన్నివిధముల శ్రమపడికూడను ప్రయోజనము వుండదు. ఈ ప్రేమ, నమ్మకములు యేవిధముగా కలుగుతాయి? మంచి మాటలతో సరియైన సలహాలతో సమయం వచ్చినప్పుడు దానిని పరిష్కారం చేసే answers తో వాళ్ళని సంతృప్తి పరచినప్పుడు విశ్వాసము, ప్రేమ, నమ్మకము ఏర్పడతాయి. సకాలములో విద్యార్థుల problems తీర్చివేయాలి. సార్ నాకొక problem వచ్చిందంటే not now, tomorrow, go అంటే వానికి depression వస్తుంది. మనకు ఎన్ని పనులున్నప్పటికిని మన కుటుంబ సమస్యలు ఎన్ని వున్నప్పటికిని వారి సమస్యను అప్పటికప్పుడే తీర్చాలి. Family problems లేని వ్యక్తులు లోకంలోనే లేరు. అందరికీ వుంటున్నాయి. ఏదో కొంచెం quantity difference వుండవచ్చు కాని quality same. అంతా ఒకే quality గా వుంటుంటాయి. కనుక మన problems లోపల యిదొక కొత్త problem గా మనము అభివృద్ధి చేయరాదు. ఈ problem తీరితే మన problem కూడను కొంతవరకు చల్లబడుతుంది. కనుక మనము అధ్యాపకులుగా వున్నప్పుడు విద్యార్థుల problem పరిష్కరించడమే మన ప్రధానమైన లక్ష్యముగా వుంటుండాలి. అది మనం తీర్చినప్పుడు మన problem కూడను చాలా మటుకు తగ్గిపోతుంది. మనము నిత్యజీవితములో సహజమైన విషయాలలోపల సన్నిహితమైన రీతిలో విద్యార్థులతో వ్యవహరించాలి.

**విజ్ఞాన శాస్త్రముతోబాటు నైతిక, ఆధ్యాత్మిక విలువలు జోడించి బోధించాలి**

అధ్యాపకులు ఒక్కొక్క subject లోపల ఒక్కో విషయాన్ని బోధిస్తూ వుంటారు. Physics వుంది. Chemistry వుంది. కేవలం వాటికి సంబంధించిన విషయాలే అధికముగా

srisathyasai vachanamrutam

బోధించటం మంచిదికాదు. దానితో బాటు నైతిక, ఆధ్యాత్మిక విలువలు జోడించి వారికి బోధించాలి. కొన్ని కొటేషన్లు వుంటాయి. ఈ పాశ్చాత్యులయొక్క కొటేషన్లతో మనకు పనిలేదు. మన భారతీయుల నిత్యజీవితములో వున్న కొటేషన్లు యెన్నో వున్నాయి. వాటిద్వారా పిల్లలకు నైతిక విషయాన్ని బోధిస్తే మంచిది. పదార్థ విజ్ఞానశాస్త్రములో పరార్థమునుకూడా ప్రవేశపెట్టాలి. ఆర్థిక విషయంలో ఆస్తిక విషయాన్ని చేర్చాలి. వృక్షశాస్త్రము లోపల కొంతవరకు జీవితవృక్షాన్ని యిమడ్చాలి. రసాయనిక శాస్త్రం లోపల మన జీవిత రసాన్ని చేర్చాలి. దీనినే ఉపనిషత్తులు "రసోవైసః" అన్నాయి. మనదంతా రసమే. ఈ కారణంచేతనే ఉపనిషత్తులు మరియు వేదములందు మనలో వున్న రసానికి 'అంగీరస' అని పేరుపెడుతూ వచ్చారు. 'అంగీరసః' అనగా "మన అంగ అంగములందు రసస్వరూపైన భగవంతుడు వున్నాడు" అని అంతరార్థము.

**మన head, food, blood అంతా తల్లితండ్రుల గిఫ్టే!**

తల్లితండ్రులను గౌరవించే విషయము వాళ్ళకి బోధించాలి. మన దేహములోని ప్రతి అంగము తల్లితండ్రులనుండి వచ్చినదే! తల్లితండ్రులయొక్క ప్రతీ blood cell కూడా మనలో ప్రవేశించింది. మన కన్నులు తల్లితండ్రుల కన్నులై వుంటున్నాయి. మన చెవులు తల్లితండ్రుల చెవులై వుంటున్నాయి. అదే విధముగనే మనదేహములో వున్న సర్వాంగములుకూడను తల్లితండ్రుల అంగములే కనుక, యీ అంగములు వారి ప్రతి బింబములే కనుక, వారిని ప్రసన్నులను గావించుకునే రీతిలో మనం కొంతవరకు ప్రయత్నించాలి. ఈనాడు తల్లితండ్రులనే గౌరవించలేని విద్యార్థులుగా తయారౌతున్నారు. కారణము యిలాంటి రహస్యాన్ని వారికి తెలిపేవారు లేకపోవటమే! కనుక మన head, మన food, మన blood అంతా parents gift. కనుక తల్లితండ్రులిచ్చిన సంపదను అనుభవిస్తూ వారినే ఆనందపెట్టలేకపోయిన యింక విద్యయొక్క విశిష్టత యేమున్నది? ఈవిషయం విద్యార్థులకు చక్కగా చెప్పాలి: "ఈనాడు నీవు పెద్దవాడివి అయివుండవచ్చు. ఎంత పెద్దవాడైనా తల్లితండ్రులకు కొడుకేగాని పెద్దవాడు కాదుకదా! ఈనాడు నీ తల్లితండ్రులను నీవు గౌరవించినప్పుడే వాళ్ళను ప్రసన్నులను చేసినప్పుడే రేపటి దినము నీ బిడ్డలు నిన్ను

sri sathyasai vachanamrutam

గౌరవిస్తారు. నీ బిడ్డలు నిన్ను ప్రసన్నులను గావిస్తారు", అని. అధ్యాపకులు ఎలావుండాలంటే విద్యార్థులు తమ దోషములను తామే పరిహారము గావించుకునే ఉత్తమ విద్యార్థులుగా తయారుచేయాలి. ఆ విధముగా చేసినప్పుడే విద్యార్థులు ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారౌతారు. మన అధ్యాపకులంతా ప్రధానంగా గుర్తించవలసినది తమ సబ్జక్టుతో పాటు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విషయాన్నికూడా జోడించి బోధించడానికి తగిన కృషి చేయాలి. పిల్లలలో ఆవేశాలు, ఉద్రేకాలు రాకుండా చూసుకోవాలి. ఈ ఉద్రేకాలు వస్తే వారిని వారే మరచిపోతారు, పిల్లలు. కనుక, అలాంటి పరిస్థితికి వారిని గొనిపోరాదు.

**మన విద్యాసంస్థ వ్యాపారసంస్థకాదని గుర్తించాలి**

మన అధ్యాపకులు ముఖ్యంగా ఈ విద్యాసంస్థ వ్యాపారసంస్థ కాదనే సత్యాన్ని గుర్తించాలి. అనేక ప్రవేటు కాలేజీలంతా యేదో ఒక వృత్తిని ఆధారము చేసుకొని విద్యను ఒక విధమైన వ్యాపార రంగముగా చేసుకుంటున్నారు. కానీ మన విద్యాసంస్థ యీ వుద్దేశ్యముతో స్థాపించినదికాదు. బాల బాలికలను పవిత్రమైన ఆదర్శమూర్తులుగా తయారుచేసి దేశం నలుమూలలా పంపి యీ దేశములో వున్న అక్రమాలను, అనాచారములను, అశాంతిని నిర్మూలము గావించాలనే పవిత్రమైన ఆశయముతో మన విద్యాసంస్థను ప్రారంభించాము. నా ఉద్దేశ్యము ప్రతి విద్యార్థి ఒక వివేకానందుడుగా తయారుకావాలి. అలాంటి వివేకానందులను తయారుచేయాలంటే మీరంతా ఏకించిత్తైనా అలాంటి పవిత్రభావములు హృదయములో స్థాపించుకోవాలి. ఇదంతా ఒక ఆధ్యాత్మిక సంస్థగా మీరు భావించుకోవాలి. ఆధ్యాత్మికమే లేకపోతే యీ చదువులంతా కేవలము పనికిరాని చదువులుగా వుంటాయి. ఈనాడు బయటి సంస్థలన్నీకూడను యీ ఆధ్యాత్మిక సంబంధము లేకపోవటంచేతనే అనేక విధములైన అల్లకల్లోలములకంతా గురి అవుతున్నాయి. మానవత అంటే యేమిటో వాళ్ళకు అర్థము కావటం లేదు. కేవలం ఆకారాన్ని చూచి మానవుడనుకంటున్నారేగానీ మానవ ప్రవర్తనను గుర్తించటానికి యే విధమైన ప్రయత్నము చేయటం లేదు. "నేను మానవుడను. నాది మానవ జాతి. నేను మానవత్వంలో వున్నాను", అని మాత్రం చెబుతున్నారు గాని 'మానవుడు' అనే పదానికి

srisathyasaivachanamrutam

అర్థం తెలియనివారు చాలా మంది వున్నారు. యీ మానవత్వానికి అర్థం తెలిసినప్పుడే మానవజాతి అని చెప్పటానికి వీలుంది. ఆకారం ఆధారం చేసుకొని నేనొక మానవుడనని చెప్పుకోకూడదు. నిత్యానిత్యవిషయ పరిశీలనా శక్తి మానవత్వములో చాలా అవసరము. అదే మనలో వుండిన బుద్ధియొక్క చురుకు దనము. ఇది నీతి నియమాదులతో కూడినదిగా వుంటుండాలి. ఇంతేకాదు, వినయ విధేయతలతో దీనిని సంపర్కము చేయాలి. ఈ క్వాలిటీస్ అభివృద్ధి చేసుకున్నప్పుడే సరైన మానవత్వం మనం గుర్తించుకోటానికి వీలవుతుంది. మనము పిల్లలకు యీ విధమైనవి సమయము చిక్కినప్పుడల్లా బోధించటానికి ప్రయత్నించాలి.

**ఆధ్యాత్మిక చింతన బయటినుండి ప్రవేశపెట్టేదికాదు, హృదయమునుండి రావాలి**

అధ్యాపకులారా! మీరు సాధ్యమైనంతవరకు, మీ శక్తి సామర్థ్యములుండినంత వరకు దుర్వినియోగం చేయకుండా బోధన చేస్తున్నారు. అది మాకు సంతృప్తిగానే వుంటున్నది. కానీ యింకా దీనిని అభివృద్ధి పరచి యింకా ఉత్సాహముతో పిల్లలను అభివృద్ధిపరచటానికి కృషి చేయాలి. పిల్లలకు ఆధ్యాత్మిక విషయాన్ని ఎక్కువగా బోధించటంవల్ల వారి భవిష్యత్తు యేమవుతుందో అనే భయానికి మీరు యేమాత్రం అవకాశమును యివ్వకండి. అంతత్వరగా సన్యాసులుగా మారే స్వభావము కాదు, వారిది. అంతేకాక, మనం బోధనలు చేయకపోయినాకూడా సన్యాసులుగా మారే మహనీయులు ఎంతమందో వుంటూ వుంటారు. ఎంత చేసినా కూడా బండవలే, గుండువలే వుంటుండి మారని మనుషులు యెంతోమంది వుంటున్నారు. ఇది కేవలం బయటినుండి ప్రవేశపెట్టేదికాదు. అది హృదయమునుండి అభివృద్ధి కావాలి. అట్టి వారికే యిలాంటి మహాప్రాప్తి జరుగుతుంది కాని అందరికి బోధించినంత మాత్రమునే సన్యాసులై కూర్చోరు. ఎన్నో జన్మాంతర పుణ్యముచేత వారికిలాంటి మహాప్రాప్తి రావచ్చును. కనుక మీరు యేమాత్రం కూడను సందేహించకుండ వారికి మధ్యమధ్య యీ ఆధ్యాత్మిక, నైతిక విషయములను చక్కగా బోధించాలి. అదే నిజమైన చదువు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని పిలిచి. “నాయనా! ఏయే వేదములు, ఏ ఉపనిషత్తులు, ఏ

sri sathyasai vacharamrutam

శాస్త్రములు పఠించావొ చెప్పు"మన్నాడు.

**చదివించిరి నను గురువుల**
**చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు నే**
**చదివినవి కలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!**

అని ఒక్క పద్యములో చెప్పాడు, ప్రహ్లాదుడు. అంతేకాక "ఓం నమో నారాయణాయ!" అన్నాడు. హిరణ్యకశిపుడు మండి పడ్డాడు, "ఇదియేమి చదువురా? ఇది నిజమైన చదువు అవుతుందా? వేదశాస్త్ర యితిహాసపురాణములను సరైన రీతిలో ఆచరణ రూపమైన ప్రచారమును సల్పుకోకుండా ఏదో నారాయణా నారాయణా అనటం యిది సరైన చదువా?" అన్నాడు. అప్పుడు చెప్పాడు ప్రహ్లాదుడు. సర్వశాస్త్రముల సారము, సర్వమతములయొక్క కీలకము, సర్వమార్గములయొక్క గమ్యము, సర్వతత్త్వములయొక్క సారము 'నారాయణ!' అన్నాడు. దీనికంటే మించినది లేదన్నాడు. ఆచార్యులలో రెండు రకముల వారుంటున్నారు, లోకములో. భీష్మాచార్యులు. దివ్యత్వాన్ని భజించి, అనుభవించి ఆనందాన్ని గ్రోలినవాడు. ఎట్లనగా పాలను మధించి వెన్నగా తీసుకొని వేరుగా పెట్టుకున్నాడు. ఇతను యీ వెన్నను తరువాత నీళ్ళలో కలిపాడు. కానీ, ఆనీటితో యీ వెన్న కలువలేదు. ఇక, ద్రోణాచార్యులు. యితను ముందుగానే పాలను తీసుకుపోయి నీళ్ళలో కలిపాడు. నీళ్లలో పాలు కలిపితే పాలు ప్రత్యేకముగా యింక రావు. అదే విధముగా యీ సంసారమనే సాగరములో చేరిపోయాడు ద్రోణాచార్యుడు. ఈ సంసారమనే సాగరములో పడక మునుపే తాను ప్రత్యేకమైన పరమహంసగా తయారైనాడు భీష్మాచార్యుడు. ఎంత గుణవంతుడు, ఎంత విద్యావంతుడు, ఎంత బలవంతుడు, ఎంత శౌర్యవంతుడు అయినప్పటికిని 'అశ్వత్థామ హతః కుంజరః' అనగానే కూలిపోయాడు, ద్రోణాచార్యుడు. మమకారముతో, మమతతో కూడిన హృదయము, ద్రోణాచార్యునిది. భీష్ముడు అలాకాదు. తను శరతల్పముపైన పరుండినప్పటికిని, తన దేహమందలి రక్తమంతా ప్రవహించినప్పటికిని ఏబది ఆరు దినములు కేవలము శాంతి పర్వమును బోధిస్తూ శాంత జీవిగా జీవిస్తూ వచ్చాడు. కష్టములందు, దుఃఖములందు, విచారములందు, బాధలయందు

srisathyasaivachanamrutam

ప్రశాంత చిత్తము ననుభవించినవాడు భీష్మాచార్యుడు. కించిత్ బాధవస్తే కృంగి పోయేవాడు ద్రోణాచార్యుడు. ఈ యిరువురి ఆచార్యులలో వుండిన భేదమును గుర్తించుకోండి.

**ధర్మసూత్రములను ఆచరించినవారికి సమస్తం చేకూరుతాయి**

ధర్మసూత్రములను పూర్తిగా అర్థము చేసుకున్నవారికి మాత్రమే యీ పవిత్రమైన భావములు కలుగుతూవుంటాయి. ఎలాంటి పరిస్థితియందు సహనము, సహనము, సహనము. ఈ సహనాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. ధర్మజుని అనేక విధములైన కష్టములు వెంటాడినాయి. నిండుసభలో భార్యను పరాభవము గావించినారు. పాండవులు ఆకులలములు మేసి అడవులలో సంచరించారు. ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ఏలవలసిన ధర్మజుడు అరణ్యములలో కాలాన్ని కఠినమైన రీతిలో గడుపుతూ వచ్చాడు. అట్టి సమయమునకూడను శాంతమును కాపాడుకుంటూ వచ్చాడు. ఈ శాంతమే ధర్మరూపాన్ని ధరించింది. సహనమే సరైన ధర్మము. క్షణక్షణము మనము ఒకవిధమైన చిట్ఫట్ అని ఎగురుతూ వుండటానికి ప్రయత్నించకూడదు. ఆవేశమును మనము అదుపులో పెట్టుకోవాలి. ఒకానొక సమయములో ధర్మజుడు తన సోదరులతో కలిసి అడవిలో సంచరిస్తూ వచ్చాడు. అధికంగా దాహం వేసింది. ధర్మజుడు ముందుకు అడుగు వేయలేకపోయాడు. అక్కడే ఒక వృక్షముక్రింద కూర్చున్నాడు. తమ్ముడైన సహదేవుని పిలిచి "నాయనా! యీ పరిసర ప్రాంతములో యేదైనా కించిత్ జలము లభిస్తుందేమో తీసుకొని రమ్మ"న్నాడు. పోయిన సహదేవుడు తిరిగిరాలేదు. తిరిగి నకులుని పంపించాడు. నకులుడు కూడను తిరిగిరాలేదు. భీముని పంపించాడు. భీముడు కూడను తిరిగి రాలేదు. అర్జునుని పంపించాడు. అర్జునుడు కూడ తిరిగి రాలేదు. వీరంతా ఏమైపోయినారో అని చెప్పి ఆందోళనలో తన దాహం మరిచిపోయాడు. ఈ దాహం బాధ పూర్తిగా పోయింది, పాపం! సోదరులు ఏమైపోయినారో అనే బాధ అధికమై పోయింది. ఈ సోదరులపై వుండిన మమత్వముచేతను, అభిమానముచేతను ఎక్కడ లేని బలము వచ్చింది శరీరానికి. వెతుకుతూ వెతుకుతూ వెళ్ళాడు. ఒక కొలనుప్రక్క యీ నలుగురుకూడను విగతజీవులై పడి వున్నారు. భరించలేని బాధను అనుభవించాడు, ధర్మజుడు. ఈ విధముగా దుఃఖము

srisathyasaivachanamrutam

ననుభవిస్తున్న ధర్మజుని చూచి అశరీర వాణి కొన్ని ప్రశ్నలు వేస్తూ వచ్చింది. అవే యక్ష ప్రశ్నలు. "ధర్మజా! ఎవరి నిమిత్తమై నీవు దుఃఖిస్తున్నావు?" అని ప్రశ్నించాడు, యక్షుడు. "నా యీ ప్రియసోదరులను ఎవరు చంపారు? వీరికీగతి పట్టటానికి కారణమెవరు?" అని ప్రశ్నించాడు, ధర్మజుడు. యక్షుడు చెప్పాడు నేనే దీనికి కారకుడనని. ఎందుకోసం నీవీ విధముగా వీరిని చేశావని తిరిగి ధర్మజుడు ప్రశ్నించాడు. నా యొక్క పద్ధతి యిది. నా కొలనులో నీరు త్రాగటానికి వచ్చిన ప్రతి వ్యక్తిని కొన్ని ప్రశ్నలు వేయటం, యీ ప్రశ్నలకు జవాబు సరిగా చెప్పిరా వారికి తగిన అనుగ్రహాన్ని అందిస్తుంటాను. నీవు కూడను నా ప్రశ్నలకు సరైన జవాబును అందించి తదుపరి విచారించటానికి ప్రయత్నించమన్నాడు యక్షుడు. ఈ యక్షుడు వేసిన ప్రశ్నలన్నింటికి చక్కగా జవాబు చెప్పాడు ధర్మజుడు. కారణం, అతని హృదయము ధర్మమయము. ఈ ధర్మము లోపల పవిత్రమైన భావములంతా స్పష్టంగా వస్తూంటాయి. ఇవి నేర్చిన విద్యలు కావు. ఇవి కూర్చిన విద్యలు కావు. హృదయమునుండి ఆవిర్భవించిన విద్యలు. అప్పుడు ధర్మజుడిచ్చిన జవాబులకు యక్షుడు మెచ్చి "అయ్యా, ధర్మజా! మున్ముందు మహా భారతయుద్ధం రాబోతూ వున్నది. ఇందులో నీకు ఎవరు ప్రధానమో నీవు కోరుకో! వారికి నేను లైఫ్ యిస్తాను", అన్నాడు. ధర్మజునిది, విశాల హృదయము. ఇదియే విద్యలయొక్క నిజమైన సారము. యోచించాడు. "యక్షా! నాకు నకులుని అందించమ"న్నాడు. అప్పుడు యక్షుడు ఆశ్చర్యపడ్డాడు. రాబోయేది మహాభారత యుద్ధము. మహాపరాక్రమవంతులైన భీముని, అర్జునుని కోరుకోకుండా చిన్న వాడైన నకులుని ఎందుకు కోరుకున్నావు?" అని యక్షుడు ప్రశ్నించాడు. "యక్షా! నాకు యుద్ధము ప్రధానము కాదు. చావులు ప్రధానం కాదు. ధర్మము నాకు ఆధారము. జయాపజయములు మానవునికి సహజములు. కష్టములే లేకపోతే మానవత్వమే వికసించదు. అన్నింటియందు కూడను ధర్మసూత్రమే నాకు ప్రధానమైన బ్రహ్మసూత్రము. నాతల్లియైన కుంతీదేవికి పుట్టిన వారము మేము ముగ్గురం, ధర్మజ, భీమ, అర్జున. నా రెండవ తల్లియైన మాద్రికి పుట్టిన వారు నకుల సహదేవులు. ఆమె మమ్ములను ఎన్ని విధములుగనో ప్రేమించింది. ఆమె తన బిడ్డలను నా తల్లికి యిచ్చి అమ్మా నీ స్వాధీనము చేస్తున్నానని చెప్పి వదులుకుంది. ఈనాడు నా తల్లి నా దగ్గర లేదు. నా తల్లికిచ్చిన మాటను

sri sathyasai vahanamrutam

నేను తప్పించకుండా చూచుకోవాలి. కుంతికి పుట్టిన వారిలో నేనొక్కడను వుంటున్నాను. మాద్రికి పుట్టిన వారిలోకూడా ఒక్కడుంటుండాలి కదా! అదే నాయొక్క ఆశ" అని బదులిచ్చాడు, ధర్మజుడు. ఈ విశాలమైన ధర్మసూత్రాన్ని గుర్తించిన యక్షుడు "ధర్మజా! నీ హృదయం పవిత్రమైనది. నలుగురికీకూడా నేను ప్రాణం యిస్తున్నాను. తీసుకు పొమ్మ"న్నాడు. చూడండి! ధర్మంలోపల ఒక్కదానికి మనం ప్రయత్నం చేస్తే అనేకము మనకు ప్రాప్తిసుంటాయి.

**నిత్యజీవితానికి అవసరమైన విద్యలు కూడా అభ్యసించాలి**

ధర్మజుడు చదువుకొనే సమయంలో యేవిధముగా చదువుకున్నాడో తెలుసా? ద్రోణాచార్యుడు పాండవులకు విద్యలు చెప్పే సమయములోపల 'సత్యం, శాంతం' అని బోధిస్తూ వచ్చాడు. ఈ రెండింటిలో పాండవులు ఐదు మంది సత్యంలో పాస్ అయిపోయినారు. సత్యం అనే అంశములో వాళ్లు పాస్ కావడం చేత వాళ్లు ఉన్నత క్లాసుకు వెళ్లిపోయారు. రెండవ అంశము శాంతం. ఈ శాంతంలో కూడను భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఫస్టుక్లాసులో పాస్ అయ్యారు. కానీ ధర్మజుడు ఫెయిల్ అవుతూ వచ్చాడు. ఎన్నోవిధాలుగా ద్రోణుడు చెబుతూ వచ్చాడు, "అయ్యా! నీవు జ్యేష్ఠ పుత్రుడవు. రేపటి దినము చక్రవర్తి కావలిసినవాడవు, నీవే విద్యలో యీ విధముగా వెనక పడితే రేపటి దినము నీ తండ్రికి యే విధముగా ముఖము చూపించాలి", అని అనేక విధములుగా అతనికి బోధిస్తూ వచ్చాడు. మన జీవితములో ఎన్ని కష్టములు, ఎన్ని దుఃఖములు, ఎన్ని విచారములు సంభవించినా దానిని భరించుకొని, సహించుకొని సాధించటానికి తగిన కృషి చేయటమే సరైన శాంతము. నారదుడుకూడా యీ శాంతాన్ని నేర్చుకున్నాడు పాపం. వంద సంవత్సరములు హిమాలయములో కూర్చుని నేను శాంతం నేర్చుకున్నానని వచ్చాడట, నారాయణుని దగ్గరకు. "ఏమి నారదా! యిన్ని సంవత్సరములు నీ వెక్కడా కన్పించలేదే" అని ప్రశ్నించాడు, నారాయణుడు. 'స్వామీ! నేను మహాతపస్సులో కూర్చున్నాను యీ నూరు వర్షములు' అన్నాడు. దేనికోసము తపస్సు చేశావన్నాడు. శాంతిని సాధించే కోసమై తపస్సు చేశానన్నాడు. నారాయణుడు టెస్టు ప్రారంభించాడు. 'నారదా! నీవు శాంతాన్ని

sri sathyasai vachanamrutam

జయించావా?' అని అడిగాడు. 'అవును స్వామీ! నేను తప్పక శాంతాన్ని జయించాను' అని శాంతంగా చెప్పాడు. మళ్లీ నారాయణుడు "నారదా! నీవు శాంతాన్ని సాధించావా?" అని అడిగాడు. అవును, స్వామీ! సాధించా"నన్నాడు. "నారదా! నీవు శాంతాన్ని సాధించావా?" అన్నాడు తిరిగి. "సాధించానంటే", అని కొంచెం కోపంగా జవాబిచ్చాడు. ఈ విధముగా అనేక పర్యాయములు సాధించావా సాధించావా అనేటప్పటికి యితనికి శాంతం పోయింది. పోయి ఒక విధమైన ఉద్రేకం వచ్చింది. అప్పుడు నారాయణుడు "నారదా! నూరు సంవత్సరములు తపస్సు చేసి యిదా, నీవు సాధించటము? కాదు. కాదు. ఎలాంటి సందర్భమునందైనా, ఎలాంటి సమయమందైన, ఎలాంటి పరిస్థితియందైనా శాంతంగా వుంటుండాలి", అని బోధించాడు. ఆనాటి చదువులంతా నిత్యజీవితములోపల general knowledge, commonsenseలను మిళితం చేసి బోధిస్తూ వచ్చాయి. అయితే యీనాడు ఏదో ఒక subject ని మాత్రమే చదువుతూ ఆ subject పైననే concentrate చేస్తున్నారు. నిత్యజీవితములో అవసరమైన వాటిపైన ఏమాత్రం గురిపెట్టటం లేదు. యీ రకం చదువు మన నిత్యజీవితానికి అవసరమైనది కాదు, జీవనోపాధికి మాత్రమే ఉపయోగపడుతుంది. నిత్యజీవితానికి సంబంధించిన విద్యలు మనం నేర్చుకోవలసినవి ఎన్నో వున్నాయి. వాటిలో remarks వచ్చి క్లాసులో marks వస్తే దాని ప్రయోజనమేమిటి?

కెమిస్ట్రీ టీచర్సంతా చెబుతూవుంటారు. "హైడ్రోజన్, ఆక్సిజన్ రెండూ కలుపుతే water అవుతూ వుంటుంది", అని. అయితే మా టీచరు యిట్లా చెప్పాడని భోజనానికి వచ్చినప్పుడు హైడ్రోజన్, ఆక్సిజన్ కలుపుకుంటాడా? కాదే! సహజమైన జలాన్ని తెచ్చుకొని త్రాగుతాడు. కనుక, మనం క్లాసులో నేర్చుకొనేది ఒకటి, దాని సత్యాన్ని గుర్తించి నిత్యజీవితము లోపల సహజముగా అనుభవించేది మరొకటి. బాహ్యప్రపంచములోపల మనం తెలుసుకొవలిసినవి చూడవలసినవి ఎన్నో వుంటున్నాయి. వీటిని నేర్చుకోవలిసిందే. అయితే దీనిని ఆధారముగా చేసుకొని మనం సహజంగా అనుభవించటానికి ప్రయత్నించాలి. కనుక, మన విద్యార్థులకు subject కు సంబంధించిన విషయాలు చెబుతూ నిత్యజీవితానికి అవసరమైన విషయాలలోపల యే విధమైన general knowledge ని పెంచుకొవాలి, ఏ విధమైన నీతి నిజాయితీలకు మన జీవితాన్ని అంకితం గావించుకోవాలి

srisathyasaivachanamrutam

అనే విషయాన్నికూడా చేర్చి బోధించాలి. మీకందరికి తెలుసు, మన ప్రశాంతినిలయములో కామావధాని వుంటున్నాడు. తెల్లవారినది మెదలు రాత్రివరకు వేదాధ్యయనము చేయటమే అతని లక్ష్యము. ఇప్పుడు 89 సంవత్సరములైపోయింది. తాను పుట్టినప్పటినుండి నేటివరకుకూడను తెల్లవారినది మెదలు రాత్రివరకు వేదాన్ని అధ్యయనము చేయటమే కాని లౌకిక విషయములలో ఏమీ తెలియదతనికి పాపం. ఏమి కామావధాని! చదువులంటే కొంతవరకు లౌకిక జగత్తునందు, భౌతికం, లౌకికం, ధార్మికం, ఆధ్యాత్మికం యీ విధముగా అన్నింటియందు సమన్వయమైనదిగా వుంటుండాలి.

ఈనాడు భౌతిక, లౌకిక విషయములలోపల యీ సైంటిస్టులు చాలా వున్నతస్థితికి పోతున్నారు. కాని, మానవత్వములో వున్న దివ్యత్వాన్ని కించిత్తైనను గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. వాళ్లలోకూడను general knowledge క్రమక్రమేణా zero అవుతోంది. దానివలననే జగత్తులోపల అనేక విధములైన సమస్యలు అధికమైపోతున్నాయి. ఒక చిన్న ఉదాహరణము. రెండునెలల ముందుగా మెక్సికోలోపల భూకంపము వచ్చింది. ఇలా భూకంపము రావడానికి కారణం ఏమిటి? oil కోసమని యీ సైంటిస్టులు, యింజినీర్లు, భూమిలోపల త్రవ్వకుంటూ, త్రవ్వకుంటూ వెళ్లటంవలన లోపల hollow అయిపోయింది. భూమి ఒక గోళము వంటిది. దీని balance కి యే విధమైన మార్పు రాకూడదు. రేపటి దినము సంక్రమణము. అంటే యేమిటి? సూర్యుడు మకర రేఖపైన ప్రవేశిస్తున్నాడు. దీని అంతరార్థము గుర్తించాలి. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ తిరుగుతూ వుంటుంది. ఇది సూర్యునిచుట్టూ తిరిగేటప్పటికి ఒక సంవత్సరము పడుతుంది. ఆ విధముగా సరైన స్థితిలో భూమి తిరిగిందంటే పగలు ఎంతో రాత్రి అంతే సమకాలముగా వుంటుంది. దీనికి పూర్వం పగలు తక్కువగా రాత్రి ఎక్కువగా వుండేది. రేపటి దినమునుండి పగలు ఎక్కువ రాత్రి తక్కువ అవుతుంది. దీనికి కారణమేమిటి? భూమి సరియైన స్థితిలో తిరుగుతూ పోతువుంటే దీనికి సమానమైన కాలమేర్పడుతుంది. కానీ భూమి కొంచెం వంగి ఏటవాలుగా వుండటంచేత యీవ్యత్యాసాలన్నీ ఏర్పడుతున్నాయి. మెక్సికో దేశములో భూమి లోపలంతా తొట్టి చేసిపెట్టారు, యీ ఆయిల్ కోసమని. ఇక, భూమిపైన పెద్ద పెద్ద భవనాలను

srisathyasaivachanamrutam

కట్టినవారుకూడను యింజినీర్సే. పైన కట్టే బిల్డింగుల పైననే పోతున్నాది, వాళ్ల దృష్టి. క్రిందికి పోవటంలేదు. క్రింద పొయ్యేవారు క్రింద తొఱ్ఱ చేసుకొని పోతున్నారు కానీ భూమిపైన వారు విచారించటము లేదు. ఇద్దరూ గొప్ప విద్యావంతులే! ఒకరి బుద్ధి యిటు, ఒకరి బుద్ధి అటూ పోతుండాది. లోపల తొఱ్ఱ, పైన భారము; యిది ఎట్లా సాధ్యమవుతుంది. ఈ తొఱ్ఱ చేసినవాడూ విద్యావంతుడే, బిల్డింగులు కట్టినవాడూ విద్యావంతుడే! ముందూ వెనుక విచారం చేయకుండా పోవడంవల్లనే యీ విధమైన ప్రమాదాలకంతా గురి అవుతున్నారు. కేవలం ఒక narrow mind లో పోతున్నారు. విశాలమైండ్ లేదు. విద్యతోపాటు విశాలతకూడ వుండినప్పుడే మనకు క్షేమం ఏర్పడుతుంది. Ph.d పిల్లలంతా వుంటారు. వాళ్లు గుర్తించుకోవాలి. భారతదేశములో పెట్రోలియంగాని, లోహములుగాని, చాలా shortage వుండటంచేత ఎక్కడెక్కడో భూములలో పరిశోధనలు చేసి, మిషనులు వేసి వానిని అన్నివిధాలా తీస్తూ వస్తున్నారు. సృష్టిలో భూమిలో ఎక్కడెక్కడ ఏఏ ప్రాంతములో ఎంతెంత ప్రమాణంలో ఏఏ పదార్థము వుండాలో అంతంత వుండే తీరాలి. మన పొట్టలోకూడను అన్ని పదార్థములు ఎంతెంత వుండాలో అంతే వుండి తీరాలి. ఏ పదార్థము కొంచెం తగ్గిపోయినా acid వచ్చి చేరిపోతుంది. అదేవిధముగానే యీ భూమిలో ఏఏ ప్రదేశంలో ఏ పదార్థము ఏఏ రీతిలో ఎంతెంత వుండాలో అంతే వుంటే అది balanced గా వుంటుంది. ఇప్పుడు భారతదేశముయొక్క సమస్యలు తీరాలని కేవలం narrow mind లో పోయి ఎక్కడంటే అక్కడ ప్రవేశించి పెట్రోలు, ఆయిల్, యినుము తుత్తునాగము అనేక విధములుగా వెలికి తీస్తూ వున్నారు. ఈ భూమిపైన ఒక్కొక్క జీవికి ఒక్కొక్కటి ఆహారంగాకూడా వుంటుంటాది. చిన్న చేపలు పెద్ద చేపలకి ఆహారంగా వుంటుంటాయి. అదే విధముగానే ఒకదానికొరకు ఒకటి అభివృద్ధి పొందుతూ వుంటుంటాయి. ఈనాడు సముద్రములోపల తొంభై కోట్ల టన్నుల చేపలనంతా చంపేస్తున్నారు. ఈ సముద్రములోపలకూడను balance తప్పిపోతున్నాది. తద్వారా అనేక సమస్యలు రావటానికి అవకాశముంటున్నాది. ఇప్పుడు కొన్ని కొన్ని ప్రాంతములలోపల జలము యే మాత్రము మనకు లభించడము లేదు. Physics teachers కొంతమంది ఇక్కడ వుంటున్నారు. నీటి సమస్య గురించి మీకందరికి తెలుసు. కేవలం మన క్లాసు రూములో

srisatyasaivachanamrutam

చెప్పడంవరకే కాదు. పల్లెలలో కొన్ని కొన్ని బావుల లోపల ఫ్లోరిన్ వుంటుంది. ఆ నీరు త్రాగడంవలన జనానికి కాళ్లు, చేతులు bones వంగి పోతున్నాయి. ఈ ఫ్లోరీన్ లేకుండా చేసే విధాన మేమిటని మన సైంటిస్టులు పరిశోధనలు చేయాలి. ఏఏ chemicals వేసి యీ నీటిని purify చేసి త్రాగటానికి అనుకూలంగా చేయాలి అనే విషయాన్ని కనిపెట్టాలి. ఈనాడు ప్రతి మనిషి లోపల sugar factory లు తయారౌతున్నాయి. లోపల Insulin develop కాకుండా పోవటంచేత యీ sugar develop అవుతుంది. దీనిని ఏ విధంగా నిరోధించాలి అనే విషయాన్ని Human development లోపల మనం కొంతవరకు అధ్యయనం చేయవలసిన సేవగా గ్రహించాలి. ఈ విధమైన విశాల భావములు మనము పెంచుకుంటూపోవాలి. అంతే కాకుండా యీనాడు మన ఆర్థిక పరిస్థితులు చాలావరకు దిగజారిపోతున్నాయి. ఈ ఆర్థిక సమస్య జగత్తునంతా కృంగదీస్తున్నదని అంటున్నాము. ఈ ఆర్థిక సమస్యవల్ల మనకు కలిగే లోపమేమి లేదు. నైతిక, ఆధ్యాత్మిక తిరోగతిని మనం చక్కగా పురోగతి గావించినప్పుడే సరి అయిపోతుంది కానీ లేకపోతే విద్య అంతను అధోగతి పాలైపోతుంది. ఇంతే కాకుండా యీ భూమిలోపల నీళ్లు చిక్కకుండా పోవటానికి కారణమేమిటి మెదలగు చిన్నచిన్న విషయాలు కూడను విద్యార్థులు చక్కగా గుర్తించుకొని వర్తించాలి. ఇప్పుడు వర్షం కురుస్తూవుంది. దానివలన క్రమ క్రమేణా నిదానంగా క్రిందికి దిగుతున్నాది నీరు. ఒక సంవత్సరము కాలము భూమిలోపలికి ఇంకిన నీటినంతా ఒక్కగంటలో పంపువేసి కొట్టేస్తున్నారు మనవాళ్లు. క్రిందికి దిగటం చాలా slow గా వుంది బయటకు తీయటం చాలా speed గా వుంది. కనుక యీ రెండింటియొక్క తారతమ్యాన్ని మనం చక్కగా జ్ఞప్తి యందుంచుకోవాలి. ఇంకో 10,20 సంవత్సరములలో రాయలసీమలో యెక్కడైనాగానీ నీరు చిక్కదు. అలాంటి పరిస్థితి బయలుదేరుతుంది. కారణమేమంటే విచారణా శక్తి శూన్యమైన యీ గవర్నమెంటు ఎక్కడ చూసినా బోర్‌వెల్ వేయిస్తోంది. ఎందుకు? వాళ్లకు ఓట్లు కావాలి. వారి తృప్తికోసమని పల్లెలో ఎక్కడ చూచినా బోరింగులు, బోరింగులు. కనుక యిలాంటి నిత్యజీవితానికి సంబంధించిన విషయాలు విద్యార్థులకు బోధించడానికి మన అధ్యాపకులంతా సరైన కృషి చేసి village development లోపల చాలావరకు పాల్గొనాలి. ఒక్కొక్క గ్రామాన్నికూడా అభివృద్ధి చేయాలి.

మన అధ్యాపకులు అలాంటి వాటిలో వుత్సాహాన్ని చక్కగా చూపుతూనే వున్నారు. కానీ, కొన్ని కొన్ని సమయాల లోపల కొంతమంది work load చాలా ఎక్కువగా వుంది అనుకుంటూ వుంటారు. కానీ ఆ విధముగా భావించరాదు. ఇంకా యింకా కావాలి. Time ని waste చేయకుండా taste చేయాలి. మనము చదివిన చదువు దేని కోసము ఉపయోగించాలి? మనం చదివిన చదువును పదిమందికీ అందించి సరైన రీతిలో వినియోగించినప్పుడు మనము పదిమందికి ఉపకారము గావించిన వారమవుతాము. వేదముకూడా ఏమి చెప్పింది? తాను తరించి యితరులను తరింపచేయమని చెప్పింది. మనమందరము కలసి పని చేద్దాము, కలసి జీవిద్దాము, కష్టములతో కలసి పోరాడుదాము. అదే

**సహనా వవతు**
**సహనౌ భునక్తు**
**సహవీర్యం కరవావహై**

'సహనా వవతు' అంటే మనమందరము కలసివుందాము. 'సహనౌ భునక్తు' అంటే మనమందరము కలసి పెరుగుదాం. 'సహవీర్యం కరవావహై' మనమందరము కలసి జీవిద్దాం. చూడండి ఎంత విశాలంగా చెప్పింది, వేదము! దీని అర్థము ఎవరు తెలుసుకోటం లేదు. తెలిసినవాళ్లుకూడను దీనిని సరైన రీతిలో వుపయోగపెట్టుకోటం లేదు. ఎందుకోసం మనం కలసి వుండాలంటే, 'సహస్ర శీర్షాఃపురుషః సహస్రాక్ష సహస్రపాత్' అనగా అన్ని శిరస్సులు, అన్ని నేత్రములు, అన్ని చేతులు భగవంతునివే! కాబట్టి యిన్ని శిరస్సులతో. యిన్ని నేత్రములతో, యిన్ని పాదములతో వుండినది భగవంతుడే అనే భావము పెట్టుకొని ఎవరికి సేవ చేసినా అది భగవత్ సేవగా మనము భావించటము దీనియొక్క అంతరార్థము. అయితే 'సహస్ర' అని వేలకు మాత్రమే ఎందుకు పెట్టారు! వేదకాలమునాటి జనులు అంతా కలిపి వేలల్లో మాత్రమే వున్నారు. ఈనాడు కోట్లు వున్నారు. అంతవరకు మనం పోనక్కరలేదు. రెండువందల సంవత్సరములకు పూర్వము బ్రిటిషువారు మన దేశములో ప్రవేశించేటప్పటికి ముప్పది తొమ్మిది కోట్లు వుంటున్నారు, భారతీయులు, భారతదేశం, పాకిస్తాన్ రెండూ చేరి. ఇప్పుడు చూస్తే డెబ్బది ఎనిమిది కోట్లు. ఈనాడు యావత్

sri sathyasai vachanamrutam

ప్రపంచమంతా చేరితే 536 కోట్లు వుంటున్నారు. ఇంతమంది జనం యీనాడు అభివృద్ధి అయినారంటే జనాభా పెరుగుతూవుంది. ఆశలు పెరుగుతూ వున్నాయి. ఆనాడు సహస్ర శీర్షాఃపురుషః అంటే యీనాడు కోట్ల శిరస్సులన్ని యేకం కావాలి. ఈనాడు ఆ cooperation అనేది లేదు. అంతా operation, operation. Cooperation ఎక్కడుంది? ఒకరి కొకరు స్నేహమనేదే లేదు. ఈ 78 కోట్ల మంది ఒకరికొకరు 1+1+1+.... I+YOU, I+YOU యీ విధముగా మనము చేసుకుంటూ పోతే ఎంత పని సాధించవచ్చు? పూర్వకాలము వేదమునందు చెప్పబడిన ఇంద్రయజ్ఞం, సూర్యయజ్ఞం, చంద్రయజ్ఞం యీ యజ్ఞములంతా ఎందుకోసం చేశారంటే ఏదో నెయ్యినంతా పాడుచేసేందుకు కాదు. చంద్రమా మనసో జాతః చక్షో సూర్యోఅజాయత.. అందరికన్నులు ఏకంగా అయిపోయి సమదృష్టితో చూడండి అని దీని కర్థం. అందరి మనసులు ఏకంకావాలి. ఇంద్రయజ్ఞమనగా అందరి చేతులూ ఏకంకావాలి. ఆ విధముగా unity వచ్చిందంటే యెంతైనా divinity ని సాధించవచ్చు. ఈనాడు unity లేక పోవటం చేతనే enmity పెరిగిపోతున్నాది.

మన యూనివర్సిటీయొక్క campus పుట్టపర్తిలో వుంటుండాది, బెంగుళూరులో వుంటుండాది, అనంతపురములో వుంటుండాది. అందరూ కలసి పని సాధించామంటే ఎంతటి కీర్తినైనా, ఎంతటి విశాల భావములనైనా, ఎంతటి సేవనైనా మనం అందించవచ్చు, అందుకోవచ్చు. ఇంకా ఒక విషయం మీకు తెలుపుతున్నాను. స్వామికి ఎట్టి ఆశలేదు. జగత్కళ్యాణమే, లోకకళ్యాణమే. లోకా స్సమస్తా సుఖినోభవంతు. సర్వులూ ఆనందంగా వుంటుండాలి. దీనిని లక్ష్యములో పెట్టుకొని, పిల్లలను సరైన అదుపులో పెట్టుకొని, వారికి సరైన మార్గమునందించే నిమిత్తమై రేపు వచ్చే June నుండి కూడను free education అనగా ఏ విధమైన డబ్బు లేకుండా education అందించాలని మేము నిర్ణయించుకున్నాము. ప్రపంచములో ఎక్కడకూడను యీ విధముగా లేదు. మన విద్యాసంస్థలు అన్నింటియందు free education. అనగా ఏ విధముగా కూడను వాళ్ల దగ్గర నుండి Tution charge గాని, games charge గాని, medical charge గాని, యేదీ వాళ్ల దగ్గరనుండి మనం తీసుకొనేదిలేదు. అంతే కాదు primary school దగ్గరనుండి Ph.D వరకునూ free education. ఈ విధముగా చేయటంవలన మాకు వచ్చే ఫలితమేమంటే,

srisathyasaivachanamrutam

మాకు ఆదాయంకాదు, పెద్ద పేరు కాదు, పిల్లలు మన కంట్రోలులో వుంటారు. తల్లితండ్రులు చాలా సంతోషిస్తారు. ఆ తల్లితండ్రులుకూడను పిల్లలను సాధ్యమైనంతవరకు అదుపులో పెడతారు. ఈ సమస్యలన్ని పరిష్కరించి విద్యార్థులను సరైన మార్గంలో పెట్టటానికై యీ విధమైన నిర్ణయము తీసుకున్నాము. పిల్లలను సరైన కంట్రోలులో పెట్టటానికి అవకాశము వుంటుంది. "నీవు సరిగా ప్రవర్తించకుండాపోతే పంపించేస్తాము, నీనుంచి మేమేది అందుకునేది లేదు. మా నుంచి నీవు అందుకోటానికి సిద్ధంగా వుండు", అని విద్యార్థులకు చెపుతాము. యీ విధంగా చెప్పటంలో management కు వేరే ఉద్దేశ్యములు లేవు. మీరు management పైన ఏ విధమైన చెడు భావాలు అభివృద్ధి చేసుకోకండి. పవిత్రమైన భావాలు పెట్టుకోండి. Management ఎంత స్వచ్ఛంగా, ఎంత నిస్వార్థంగా, ఎంత పవిత్రంగా, ఎన్నో విధములైన పరోపకార దీక్షతో పని చేస్తున్నదనే సత్యాన్ని మీరు చక్కగా విశ్వసించి, తదుపరి మీరు చేయవలసిన కర్తవ్యములు మీరు చక్కగా చేయండి. మీకందరికి తెలుసు వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ వీరంతా మీకు చెప్పి వుంటారు. ఏదో మనకు UGC grants అంతా పంపిస్తున్నారు. వాళ్లు జీతాలిస్తున్నారని మీరనుకుంటున్నారు. వాళ్లు ఎప్పుడిస్తారో యేమో కాని, ఆ గ్రాంట్లు ఇప్పటికి సరిగా రావటం లేదు. అందరికి management మాత్రమే జీతభత్యాలు చెల్లిస్తోంది. అది చాలామందికి తెలియదు. వాళ్లు యేదికూడా regular గా పంపటంలేదు. మీకు తెలుసు ప్రభుత్వముయొక్క విషయము. ప్రతి నెలకు కూడను, (మీ దగ్గర గుట్టు పెట్టుకొనేది యేమి లేదు, నాదే మీది మీదే నాది) ఐదు లక్షలు చొప్పున ఖర్చువుతోంది. నిన్నటి దినము లేబరేటరీలో కెమికల్సుకి కావాలని మూడున్నర లక్షలు తీసుకున్నాడు I.J. నాయుడు. ఈ విధముగా మేము డబ్బుకోసం యేమాత్రం లక్ష్యం చేయటంలేదు. మీరు ఆనందముగా సద్వినియోగము చేసి దానిని సరైన రీతిగా పిల్లల కందించి ఆదర్శప్రాయులైన విద్యార్థులుగా తయారుచేయాలని నేను మిమ్మల్ని కోరుతూ యింకా దీనిని మీరు అభివృద్ధి గావించుకునే ఉత్సాహము పెంచుకొని కాలనిర్ణయం లేకుండా మీ కర్మనంతాకూడను మీరంతా సద్వినియోగము గావించుకోవాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

మరొక చిన్న విషయము. Ph.D పిల్లలు Chemistry, Physics, Biology,

sri sathyasai vachanamrutam

Mathematics అన్ని రంగాలలో వున్నారు. ఇది 1st batch కనుక వీరు సరైన రీతిలో అభివృద్ధి అయితే యింక ప్రత్యేకించి మనం టీచర్లను వెతుక్కోనక్కరలేదు. మన విద్యార్థులేకనుక, మనయొక్క విద్యాసంస్థలలో వీరిని అధ్యాపకులుగా పెడితే యింకా ఎంతైనా పని చేయించుకోవచ్చు. కనుక, వాళ్లను యిప్పుడు గైడ్‌చేసే ప్రొఫెసర్సు అంతాకూడను అధిక శ్రద్ధతో స్పెషల్‌గా వారిని సరైన రీతిలోపల సరైన అధ్యాపకులుగా తయారు చేయటానికి తగిన కృషి చేయాలని నేను ఆశిస్తున్నాను. వారు చాలా చక్కని పిల్లలు. అందములోనే కాదు, స్వామియందు ప్రేమలో కాని, భక్తిలోగాని, వైరాగ్యములో గాని అన్ని విధములా వారు అర్హత కల్గినవారు. పిల్లలలో ఒకప్పుడు పొరపాట్లు రావచ్చును. కనుక, వాళ్లలో వున్న తప్పులు మాత్రమే చూడకుండా, వాళ్లలో వుండే పవిత్రతను మాత్రం మనం తీసుకుని వారిని చక్కని ఆదర్శప్రాయులైన ఆధ్యాపకులుగా మీరు తయారు చేసి మీ కాలాన్ని, మీ కాయాన్ని, మీ కర్మను యింకా అధికంగా వాళ్లకు అందించి వాళ్లు చక్కగా ఉత్తీర్ణులయ్యేటట్టుగా చేయాలని నేను మరొక తూరి ఆశిస్తున్నాను. మీ కందరికీ నేనెక్కువ శ్రమనందించాను. కాని మధ్య మధ్య 15 రోజులకో 20 రోజులకో యిలాంటి చిన్నచిన్న సమావేశాలు పెట్టుకుంటే యింతసేపు నేను మాట్లాడను. కొద్దికొద్దిగా మాట్లాడి మీయొక్క సమస్యలు, మీ అనుకూలాలు యేమిటో నేనుకూడా తెలుసుకొని దానికి తగిన పరిహారం చేస్తూవుంటే చాలా ఆనందంగా వుంటుంది. ఉత్సాహంగా పనులు చేయటానికి అవకాశము వుంటుంది. ఇప్పుడుకూడా మీకేమైనా సమస్యలుంటే చెప్తే వాటిని సరిచేసుకొని అన్ని విధాలా అనుకూలాలు చేస్తాను. మీ problem అంతా ఒక్కటే. కొన్ని టేబుల్సు, కొన్ని చైర్సు. యిదే పెద్ద problem మీకు. యింకే విధమైనవి లేవని నాకు తెలుసు. అదికూడా సరి చేస్తాను. వీటిని మీరు problem గా తీసుకోకూడదు. Adjustment చేసుకుని పోవాలి. తప్పక దానిని సరిచేయటానికి మేముకూడా సిద్ధముగా వుంటాము. మీ కందరికి తెలుసు. ఆధునిక యుగము కావటంచేత యిన్ని comforts కోరుతున్నాము. పూర్వం యేమీ లేవుకదా! అలాంటి సమయము లోపలనే ఎన్నో విధములైన విద్యలను అభ్యసిస్తూ వచ్చారు. ఐన్‌స్టీన్ మీకు తెలుసు. చాలా గొప్ప తత్త్వవేత్త. మంచి సైంటిస్టు. ఆయన చెప్పేవాడు "యీ లేబరేటరీస్, యీ విధమైన ఎక్విప్‌మెంటు నా కక్కర లేదు. ఒక పేపరు, పెన్సిలు వుంటే

sri sathyasai vachanamrutam

చాలు. దీనిని పడవేయటానికి ఒక waste paper basket వుండాలి", అని. అన్నీ సరి చేసుకుని నేర్చుకున్నటువంటివాడు. Physical comforts అనేవి వుండవలసినదే. కాని దానిని మీరు ప్రధానంగా తీసుకోకుండా mental comfort తీసుకొండి. తద్వారా ఎంతైనా సాధించవచ్చు. మనుషులు చేరటం గొప్ప కాదు. మనసులు చేరే విధానాన్ని చూసుకొండి. మనసులు కలిస్తే జగత్తంతా మన యిల్లే అవుతుంది. కేవలం మనుషులు కలిసి మనసులు కలుసుకోకుండా పోయినట్టయితే రూము, రూములో రెండేసి పార్టీషన్సు తయారౌతాయి. మీకేమైనా సమస్యలున్నాయా? వాళ్లతో, వీళ్లతో కాకుండా నాతో చెప్పుకుంటే నాకు ఆనందం అవుతుంది. మీ అందరిలో నేను కూడా ఒకడిగా భావించండి.

**(తేదీ 12-1-1986న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam